క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గండ్ర దంపతులు

టేకుమట్ల: హోళీ పర్వదినం సందర్భంగా మండలంలోని రాఘవాపూర్‌లోని శ్రీవెంకటేశ్వర సేల్స్ కార్ప్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం కొనసాగుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుకలను ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యనిధి, ఆరా ధీన, హోమం బలిహరణములు, మహా పూర్ణాహుతి కార్యక్రమాల అనంతరం సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. హోలీ రోజున కొనసాగే జాతరకు భక్తులు పోటెత్తడంతో జాతర ప్రాంగణం కోలాహలంగా మారింది. భక్తులకు ఉత్సవ కమిటీ, ఎస్‌వీసీఎస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారి వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ నందికొండ శోభామహిపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కొండ్ర ఓదెలు, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు న్నారు.

నియామకం

మహదేవపూర్: ఎమ్మార్పీఎస్ మహదేవపూర్ మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన బెల్లంపల్లి సురేష్‌మాదిగను నియమించినట్లు జిల్లా కన్వీనర్ విజయ్‌మాదిగ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాయకులు నియామక పత్రం అందజేశారు. తమ ఎన్నికకు సహకరించిన తూటీచర్ల దుర్గయ్య మాదిగకు, లింగాల సమ్మయ్యకు, బాధ్యతలు ఇచ్చిన విజయ్ మాదిగకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్‌కాస్ట్ మైన్‌కు నేషనల్ సేఫ్టీ అవార్డు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్ నేషనల్ సేఫ్టీ అవార్డుకు ఎంపికైనట్లు తాడిచర్ల మైన్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మైన్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి మంగళవారం తెలిపారు. గత (2017–2021) ఐదేళ్ల కాలంలో జీరో ప్రమాదాల కారణంగా జాతీయ సేఫ్టీ అవార్డుకు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు. దేశంలో 700 ఓపెన్‌కాస్ట్ కోల్ మైన్స్‌లలో తాడిచర్ల మైన్ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జెన్‌కో, ఏఎమ్మార్ అధికారులు, కార్మికుల కృషితో సాధ్యమైందన్నారు. జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డైరెక్టర్ టీఆర్‌కేరావు, ఏఎమ్మార్ ఎండీ. ఏ మహేష్ కుమార్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారులు, కార్మికులను ఈ సందర్భంగా అభినందించినట్లు వారు వివరించారు. ఈ స్ఫూర్తినే ఇలాగే కొనసాగించాలని రాబోయే రోజుల్లో మరింత రక్షణతో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

మహదేవపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బట్టు విజయ్ కుమార్ మాదిగ అన్నారు. ఈ మేరకు అంబట్‌పల్లిలో ప్రారంభమైన సంగ్రామ పాదయాత్ర రెండోవ రోజు మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ బట్టు విజయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి కూడా పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వైన్స్ షాపు దగ్ధం

గణపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వైన్స్ షాపు దగ్ధమైన సంఘటన మండలంలోని చెల్పూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చెల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సింగరేణి 1000 క్వార్టర్స్ సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 10 లక్షల రుపాయల విలువ చేసే మద్యం దగ్ధమైంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇద్దరికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలోని బొప్పారం మూలమలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంహెచ్40 బీఈ 0625 అనే నంబర్ గల కారు మహదేవపూర్ వైపు నుంచి కాటారం వైపుగా వస్తుంది. ఇదే క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలోని బొప్పారం మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం బొప్పారం వైపుగా రోడ్డుదాటుతుంది. ఈ క్రమంలో కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి అనంతరం అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో పాటు బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఎంత కష్టం వచ్చినా వెరవక ముందుకు సాగుతున్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తు ఎన్నో విజయాలను సాధిస్తున్నారు. నేడు(బుధవారం) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలపై ప్రత్యేక కథనం.

ధైర్యంతో ముందుకు వెళ్లాలి



భూపాలపల్లి అర్బన్: ఒక మహిళ ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే సమయం వరకు నిరంతరం పని చేస్తునే ఉంటుంది. ప్రతి పనిలో ధైర్యంగా ముందుకు వెళ్లాలి. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏం లేదు. ఇంట్లో పనులతో పాటు ఉద్యోగ రీత్య కూడా పని చేస్తున్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. మహిళలకు ఉన్నటువంటి హక్కులను చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇన్ని పనులు చేయాలంటే ముఖ్యంగా ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యంగా జీవించేదుకు నాణ్యతతో కూడిన ఆహారం తీసుకోవాలి.

- కూరాకుల స్వర్ణలత, జాయింట్ కలెక్టర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



భూపాలపల్లి అర్బన్: ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సి ఉంది. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. అదునిక టెక్నాలజీని అలవర్చుకుంటూ.. ప్రతి మహిళ తన కళలను సాకారం చేసుకునే దిశగా ముందుకెళ్లాలి. రోజు, రోజుకు మహిళలపై హింసా కార్యక్రమాలు క్రమంగా పెరుగుతున్నాయని, మహిళలను వేధించేవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేదంటే మహిళల మనుగడ కష్టమవుతుంది. తల్లిదండ్రులు ఆడ మాగ అనే వివక్ష లేకుండా పిల్లలను పెంచాలి.

- శైలజ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి

ధైర్యంగా చదువుకోవాలి



చిట్యాల: మహిళలు ధైర్యంగా ఉండి.. చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలి. చదువుకుంటే ఏదైనా సాధించవచ్చు. మాది గోదావరిఖని, నాన్న సింగరేణి ఉద్యోగి అమ్మ ఇంటి వద్దనే ఉంటుంది. మా అమ్మ, నాన్నలు కష్టపడి అందరినీ చక్కగా చదివించారు. మొదటగా కరీంనగర్ జిల్లాలోని మంథని ముత్తారంలో ఒక సంవత్సరం కాంట్రాక్ట్ ఉద్యోగం చేశాను. 2021లో వివాహం చేసుకున్నాను. ఉమ్మడి వరంగల్ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక ప్రభుత్వ సబ్ సెంటర్ పనిచేశాను. ఇప్పుడు చిట్యాల మండలంలోని ఒడితల పీహెచ్‌సీలో వైద్యురాలుగా పని చేస్తున్నా. ఆడ పిల్లలు ఒకరిపై ఆధారపడకుండా ధైర్యంగా చదువుకోవాలి. ఉన్నంతగా ఉద్యోగం సాధించాలి. ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ మౌనిక, ఒడితల పీహెచ్‌సీ

ప్రజాసేవ కోసం ఉద్యోగాన్ని వదిలేశా..



ప్రజలకు సేవ చేయాలనే కోరిక చిన్నప్పటి నుంచి బలంగా ఉండిపోయింది. ఉన్నత చదువులు చదువుకొని రూ.లక్షలు వచ్చే ఉద్యోగాన్ని సైతం వదులుకొని రాజకీయాల్లోకి వచ్చాను. రాజ్యాంగం కల్పించిన అవకాశం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో జిల్లాకు మొదటి జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించా. రాజకీయపరంగా ఎన్నో ఒడిదొడుకులు ఉంటున్నప్పటికీ మనోధైర్యంతో ఎదుర్కొంటూ ప్రజలతో మమేకమవుతున్నా. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏది లేదు. అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడి గుర్తింపు తెచ్చుకోవాలి.

- జక్కు శ్రీహర్షిణి, జెడ్పీ చైర్‌పర్సన్

కూలీ పని చేస్తూ కూతుళ్లను ప్రయోజకులుగా..

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన వనజ–లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరూ కూతుర్లే అని ఏనాడూ భావించకుండా కూలీ పని చేస్తూ వారిని ప్రయోజకులు చేశారు. పెద్ద కూతురు నాగలత ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసి 2018లో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించింది. చిన్న కూతురు హేమలత బీఎస్సీ డీఎడ్ పూర్తిచేసి 2012 డీఎస్సీలో తెలంగాణ టాపర్‌గా నిలిచి టీచర్ ఉద్యోగం సాధించింది. గతంలో తము పడ్డ కష్టానికి ప్రతిఫలంగా కూతుర్లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తమకు గర్వంగా ఉందంటున్నారు.

శభాష్ అనయా..

- ఆర్చరీలో రాణిస్తున్న కాటారం చిన్నారి
- తొమ్మిదేళ్ల వయసులోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ



ఆర్చరీ పోటీల్లో అనయా(ఫైల్)

కాటారం: ఆడుతూ పాడుతూ ఉండాల్సిన వయస్సులో అత్యంత కఠినమైన విలు విద్య (ఆర్చరీ)లో రాణిస్తుంది ఓ చిన్నారి. తొమ్మిదేళ్ల వయస్సులోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ శభాష్ అనిపించుకుంటుంది చిన్నారి అనయా. మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజశేఖర్ కూతురు రామిళ్ల అనయా అతి చిన్న వయస్సులో అర్చరీలో సత్తా చాటుతుంది. ప్రస్తుతం తొమ్మిదేళ్ల వయస్సు ఉన్న అనయా ఏడేళ్ల వయస్సులో కరీంనగర్‌లో పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఆర్చరీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. శిక్షణలో ముందంజలో నిలిచిన అనయా 2022లో హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్–9 రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొని బ్రౌంజ్ మెడల్ సాధించింది. అనంతరం కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ కైవసం చేసుకుంది. గత ఏడాది మే 23న రాజమండ్రిలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఈ ఏడాది జనవరి 13 నుంచి 16 వరకు జరిగిన అండర్–9 రెండో జాతీయ అర్చరీ పోటీల్లో అనయా పాల్గొని ప్రశంసలు అందుకుంది. అంతే కాకుండా జిల్లా నుంచి అర్చరీ విభాగంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిలిచిన క్రీడాకారిణిగా అనయా రికార్డును నెలకొల్పింది. అతి చిన్న వయస్సులో అనయా ఆర్చరీలో దూసుకుపోవడంపై ఆమె తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.



కరీంనగర్ కమిషనరేట్ శిక్షణ కార్యక్రమంలో అనయా(ఫైల్)

జాతరకు పోటెత్తిన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

- జనసంద్రంగా మారిన కోటంచ ఆలయ ప్రాంగణం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హోళీ పండుగ సందర్భంగా జాతర అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పెద్ద రథోత్సవంలో ఎడ్లబండ్లతో పాటు, ప్రభబండ్లు, ఇతర వాహనాలతో జాతర కిక్కిరిపోయింది. స్వామివారికి బోనాలతో భక్తులు మొక్కులు చెల్లించారు. జాతరకు భూపాలపల్లి జిల్లాతో పాటు, వరంగల్, ములుగు, కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు మొక్కులో భాగంగా తలనీలాలు సమర్పించుకుని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతి, కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎస్పీ రాములు , సీఐ పులి వెంకట్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్‌పర్సన్ మాదాడి అనితకరుణాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పబ్బ శ్రీనివాస్, ఎంపీటీసీ ఎర్రబెల్లి రవీందర్‌రావు, ఆలయ ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో గండ్ర సత్యనారాయణరావు



జాతరలో ప్రభబండ్లు



కోటంచ ఆలయంలో భక్తులు

మహిళలకు అండగా 'సఖి'

భూపాలపల్లి రూరల్: ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్నింటా సగంగా మారుతున్నారు. వ్యవసాయం నుంచి మొదలుకొని అన్ని రంగాల్లో తమదైన శైలిలో ముద్ర వేస్తున్నారు. మహిళల రక్షణ, గృహ హింస, వరకట్న వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, లైంగిక హింస, ఆడపిల్లల అమ్మకం, రవాణా నివారణ కోసం జిల్లాల వారిగా ప్రత్యేకంగా సఖి కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహిళలకు హెల్ప్‌లైన్ నంబరు 181కి ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు రక్షణ కల్పిస్తారు. ఆపద సమయంలో 08713–295666 లేదా 85000 09433 జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి ఫోన్ ద్వారా సమాచారం అందించి రక్షణ పొందవచ్చు. ఈ కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటుంది. అభాగ్యులైన మహిళలకు న్యాయ, వైద్య, కౌన్సిలింగ్, పోలీస్ సహాయంతో పాటు ఐదురోజుల తాత్కాలిక వసతి కల్పిస్తారు. ఆరునెలల పాటు కుటుంబాల పరిస్థితులను గమనిస్తారు.



జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం

సద్వినియోగం చేసుకోవాలి.



సఖి కేంద్రం మహిళలకు అన్ని రకాలుగా అండగా ఉంటుంది. సఖి సేవలను బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. సఖి కేంద్రం అండగా ఉండి సత్వరన్యాయం, భరోసాగా ఉంటుంది.

- గాయత్రి, కార్యనిర్వాహకురాలు

నేడు తొర్రూరుకు మంత్రి కేటీఆర్



తొర్రూరులో సమీక్షిస్తున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నేడు(బుధవారం) తొర్రూరులో పర్యటించనున్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మహిళా దినోత్సవ కానుకగా, రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాలను చెక్కుల రూపంలో అందజేయనున్నారు. పర్యటన ఏర్పాట్లపై మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంబంధిత అధికారులతో చర్చించారు.

ఘనంగా హోలీ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్దలు, పిల్లలు, మహిళలు, యువకులు ఆనందోత్సవాల మధ్య రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు సంప్రదాయ పద్ధతిలో వేడుకలను జరుపుకుంటూ ఒకరిపై ఒకరు కొడిగుడ్లు కొడుతూ సంబురాలు నిర్వహించుకున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

చిట్యాల: హోలీ వేడుకల్లో పోలీసులు



కాటారంలో..



మల్హర్: హోలీ సంబురాల్లో కొయ్యూరు వాసులు



భూపాలపల్లి అర్బన్: రంగులు పుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ



రేగొండలో..





చిట్యాల: చల్లగరిగలో..



టేకుమట్లలో..



భూపాలపల్లి అర్బన్: జిల్లా జడ్జితో వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు



కాటారం ప్రధాన కూడలిలో..



కాళేశ్వరంలో..



టేకుమట్లలో..



టేకుమట్ల: సంబురాల్లో యువకులు



భూపాలపల్లి అర్బన్: హోలీ వేడుకల్లో యువకులు



మహదేవపూర్‌లో..



మొగుళ్లపల్లిలో..



కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో..



కాళేశ్వరం: వీఐపీ ఘాటు గోదావరి వద్ద యువత



మహాముత్తారం: కొర్లకుంటలో..



భూపాలపల్లి అర్బన్‌లో..



మొగుళ్లపల్లిలో..